"శ్రీ అరబిందో ఏమన్నారు? వివేకానంద ఏం సెలవిచ్చారు? జి.కె. ఏం వివరించారు – ఇవన్నీ నాక్కెందుక్కాని మనపెళ్ళెప్పుడు" కళ్ళల్లో ఆవేదనని నొక్కి పెడుతూ అడిగింది వినిత.

"ఉద్యోగం రాగానే" చప్పున చెప్పాడు శ్యామ్.

"ఎలా వస్తుంది?"

అతను అయోమయంగా చూస్తూ "ఎలా రావటం ఏంటి" అన్నాడు.

# పగిలిన గవ్వ

## కుప్పిలి పద్మ



"నువ్విలాగోడకి కాళ్ళు తన్నిపెట్టు కొని ఇంటిపెంకులు లెక్కపెడుతుంటే ఉద్యోగం ఎలా వస్తుంది?" కోపంగా అందామె.

"బ్యాంక్ టెస్ట్ రాసాను. రైల్వే సర్వీసు కమిషన్‌కి అప్లై చేశాను. ఆల్విన్‌లో వస్తుందేమోనని ప్రయత్నిస్తున్నాను. నువ్విలా తొందరపడితే ఎలా" నిదానంగా అన్నాడతను.

"తొందరా? ఇంట్లో నాకున్న ప్రెషర్‌కి ఇంకొకళ్ళైతే ఈ పాటికి నిన్నేదో జాబ్‌లోకి బలవంతంగా నెట్టేవారు. ఇదిగో ఆ గవర్నమెంట్, పబ్లిక్ సెక్టార్‌లలో ఉద్యోగాలు వచ్చినప్పుడు సెక్యూరిటీ వున్న ఉద్యోగం దొరికిందని మురిసిపోవచ్చు కాని వెంటనే ఏదో ఒక ఉద్యోగం సంపాదించు" అందామె.

"సమస్యలు వస్తుంటాయి. సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారం వెంటనే దొరకకపోతే అరబిందో ఏం చెయ్య....." చెప్తున్న అతని వైపు చురచురా చూస్తూ రెండు చేతులెత్తి పెద్ద చప్పుడుతో నమస్కారం పెడుతూ "బాబోయ్ నీకు, మీ అరబిందోకి ఓ నమస్కారం. నాకేం చెప్పొద్దు. వెంటనే ఉద్యోగం సంపాదించు" అందామె.

"ఉద్యోగాలు అంత త్వరగా దొరుకుతాయేంటి? దొరికినా ఆ డబ్బులు మనకి సరిపోతాయేంటి" నీరస స్వరంతో అడిగాడు. "ఏ ఉద్యోగమైనా చెయ్యొచ్చు. డబ్బులు సరిపోకపోవటం అనే సమస్య తాతా, బిర్లా, అంబానీల నుంచి వందరూపాయిల జీతగాడి వరకూ వుంది. రెండు, మూడు రోజుల్లో నేనో ఉద్యోగం సంపాదించుకొస్తాను. నువ్వు నీకో ఉద్యోగం సంపాదించుకో. ఓ వారంపదిరోజుల్లో మన పెళ్ళి అయిపోవాలి" ఆజ్ఞాపించింది వినిత.

"అదికాదు విని నా మా..." చెప్పున్న అతని మాటల్ని అసలు వినిపించుకోకుండా, "నేనేం వినను. నేచెప్పింది గుర్తుపెట్టుకో. వస్తా" అంటూ రివ్వు రివ్వున గదిలో నుంచీ వీధిలోకి వచ్చి తన ఇంటి వైపు నడిచింది వినిత.

'అబ్బా! ఈ వినితకి ఎలా చెపితే అర్థం అవుతుంది. అసలు ఉద్యోగాలు దొరుకుతాయా. దొరికినా చాలా తక్కువ జీతం వస్తుంది. ఇప్పుడేదో ఆవేశంలో వుంది. రెండ్రోజులు పోతే నార్మల్‌కి వస్తుందిలే' అనుకుంటూ తలని "ఒక యోగి ఆత్మకథ" పుస్తకంలోకి దూర్చాడు శ్యామ్.

xx xx xx

వినిత తండ్రి గిరిధరరావు స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగి. అతని భార్య శకుంతల గృహిణి. వాళ్ళకి నలుగురు పిల్లలు. వినిత, అనిత, శ్రీనిత, మనీత్ కుమార్.

ఇద్దరూ లేక ముగ్గురు అని ప్రకటనలు వున్నా అందర్లాగే పుత్రప్రేమ నలుగురు బిడ్డల తండ్రిని చేసింది గిరిధరరావుని. పైసా పైసా కూడపెట్టి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయటమే జీవితాశయంగా, కొడుకుని పెద్ద చదువులు







చదివించటమే కోరికగా పెట్టుకున్నారా దంపతులు.

ఆడపిల్లల్ని పదో తరగతి వరకు చదివించి పనీపాట నేర్చుకోమని ఆర్డర్ ఇచ్చేసాడు.

పెళ్ళంటే మాటలా?

వనితని చూసిన మొదటి రెండు సంబంధాల వాళ్ళు "అమ్మాయి బాగుంది. కాని, డిగ్రీ చదివిన అమ్మాయి కావాలి" అన్నారు.

చదువుంటే కాని పెళ్ళి కాదనే అభిప్రాయానికి వచ్చి కూతుళ్ళ చదువు

కంటిన్యూ చేయించాడు గిరిధరరావు.

ఒకరికి వినిత జాతకం నచ్చలేదు. మరొకరికి గిరిధరరావు ఇచ్చే కట్నం ఆనలేదు.

ఈలోగా వినిత డిగ్రీ పూర్తయింది. అనిత డిగ్రీ ఫస్టియర్‌లోకి వచ్చింది. శ్రీనిత ఇంటర్‌లో జాయిన్ అయింది.

పి.జి. చేస్తే పెళ్ళి చెయ్యటం చాలా కష్టమని సిన్సియర్‌గా నమ్మి వినితని టైప్, షార్ట్‌హేండ్ నేర్చుకోమన్నాడు గిరిధరరావు. వినిత టైప్ ఇన్స్టిట్యూటుకి వెళ్ళేముందో, తిరిగి వస్తున్నప్పుడో లైబ్రరీకి వెళుతూండేది.

ఆమెకి అక్కడే శ్యామ్‌తో పరిచయం అయింది.

"ఉపనిషత్తులపై ఏమైనా పుస్తకం వుందాండి" అంటూ లైబ్రరీ అసిస్టెంట్ మధుని ఆమె అడిగింది.

అప్పుడు శ్యామ్ మధు ఎదురుగా కూర్చుని వున్నాడు.

ఆ అసిస్టెంట్, ఈ శ్యామ్ ఒకే రూమ్‌లో అద్దెకి వుండేవారు. వీళ్ళిద్దరిదీ కూచిపూడి. ఉద్యోగం కోసం మధు ఈ వూరొస్తే, చదువుకోడం కోసం శ్యామ్ వచ్చాడు.

శ్యామ్ ఉపనిషత్తులపై వున్న పుస్తకాలు, ఏయే పుస్తకాలలో ఏంవుందో గుక్కతిప్పకోకుండా వివరించి "మీకేం కావాలి" అని ఉత్సాహంగా అడిగాడు.

"ముందు మీకో గ్లాసు మంచినీళ్ళు అవసరమనుకుంటాను" అంటూ ఆమె నవ్వి "ముందుగా ఏ పుస్తకం చదివితే మిగిలినవి అర్థం అవుతాయో చెప్పండి" అంది.

శ్యామ్ చెప్పాడు.

మధు ఇచ్చాడు.

వినిత "థాంక్స్యూ" అని పుస్తకంతో వెళ్ళిపోయినా మట్టిగాజుల గలగల శ్యామ్ హృదయాన్ని పలకరిస్తూనే వుంది.

ఆ తర్వాత వినిత ఓసారి శ్యామ్‌ని చూసి తొలకరి జల్లులాంటి నవ్వు అధరాలపైకి జార్చి "నాకేదైనా మంచి పుస్తకం సజెస్ట్ చెయ్యండి. ఫ్రెండ్ బర్త్‌డే. ప్రజెంట్ చెయ్యాలి" అంది.

శ్యామ్ కళ్ళు శ్రావణమేఘం మెరుపల్లే చమక్ చమక్ లాడాయి. వినిత తన పట్ల చూపించిన గౌరవానికి ముగ్ధుడైపోయి పుస్తకం సజెస్ట్ చెయ్యటమే కాదు ఏ షాపులో దొరుకుతుందో కూడా చెప్పాడు.

వినిత మరోసారి "థాంక్స్యూ" అని వెళ్ళిపోయింది.

ఆ రాత్రి శ్యామ్ నయనాల నిండా రంగురంగు మట్టిగాజులే.

ఓరోజు మధు, శ్యామ్ కబుర్లు చెప్పకుంటుంటే వచ్చిన వినిత "అవునూ మీరేం చేస్తుంటారు? ఎప్పుడు చూసినా ఇక్కడే కన్పిస్తుంటారు. ఇది మీ ఇద్దరికీ కలిపి వచ్చిన ఉద్యోగం అంటుంది మా అనిత" అంటూ బోల్డంత సందేహాన్ని తన పెద్ద పెద్ద కళ్ళు గుండ్రంగా తిప్పతూ వ్యక్తపర్చింది.

"పి.జి.పూర్తయిందండి. ఉద్యోగం కోసం చూస్తున్నాను" అన్నాడు శ్యామ్.

"ఉద్యోగం ఎప్పడొచ్చినా పర్లేదండి. వీళ్ళ నాన్నగారికి వ్యవసాయం వుంది. ఇతనికో తమ్ముడు. అతనూ చదువుకుంటున్నాడు. వీళ్ళకి నాన్నగారు బానే పంపిస్తారు. హాయిగా అరబిందాని, జి.కె.ని చదువుకోవచ్చు" అన్నాడు మధు.

"ఆ అదేం కాదులేండి. ఎన్నాళ్ళు ఒకరిపై ఆధారపడతామండి. గవర్నమెంట్ ఉద్యోగం వస్తే చేస్తాను. బ్యాంక్ టెస్ట్‌లు రాస్తున్నాను" వినిత తననెక్కడ వ్యక్తిత్వం లేనివాడంటుందోనని బెంగపడుతూ మధు వైపు రోషంగా చూస్తూ అన్నాడు శ్యామ్.

"ఆ గవర్నమెంట్‌ది వచ్చేలోగా ఇంకేదైనా జాబ్ చెయ్యవచ్చుగా" అంటూ "వెళతానండి" అందామె.

"కూర్చోండి, కూర్చోండి టీ తాగి వెళుదురుగాని" అన్నాడు మధు.

"టైమ్ లేదండి. పిల్లలు ఎదురు చూస్తుంటారు" అందామె.

"పిల్లలా" శ్యామ్ గుండె ఝుల్లుమంది.

"ట్యూషన్ పిల్లలు" అంటూ బయటకి వెళ్ళిపోయింది వినిత.

సంపెంగల పరిమళం వుక్కిరిబిక్కిరి చేస్తుంటే, గాజుల సవ్వడి కవ్విస్తుంటే


# అవన్‌వారి నాన్-స్టిక్ & ఎల్యైర్ కుక్‌వేర్ శ్రేణి.

కుక్‌వేర్‌లో అవన్ A1 స్థానంలో ఉంది.



నాన్-స్టిక్‌గా ఉంటాయి మరియు నూనె తక్కువగా అవసరమౌతుంది.



ఎంత చక్కని ఫినిష్, దానియొక్క ''గ్రూవ్స్'' సాంకేతికంగా ఉష్ణము యొక్క వంపిణీని మెరుగుపరుస్తుంది మరియు ఇంధన వినియోగాన్ని తగ్గిస్తుంది. యుఎస్ఎ నుండి దిగుమతి చేసుకోబడిన పిటిఎఫ్ఇ మెటీరియల్‌తోను మరియు వర్జిన్ అల్యూమినియమ్‌తోను తయారు చేయబడినది, అవి

స్పెషల్ అల్యూమినియమ్ లోహముతో తయారు చేయబడిన ఈ ఎల్యైర్ శ్రేణి గట్టిగా అంటిపెట్టుకునుండెడి అపారమైన శక్తితో దీర్ఘకాలంపాటు మన్నుతుంది. మీరు ఎంపిక చేసుకోడానికి అనువుగా విస్తృతమైన శ్రేణి ఉంది.





AVON
కుక్‌వేర్
మీకు ఇష్టమైన ఆఖరి ఎంపిక

53, అమర్ నగర్, జె.పి. రోడ్, వెర్‌సోవా, అగర్‌ఖాన్ బాగ్ ఎదురుగా, అంధేరి (ప), బొంబాయి-400 061. ఫోన్ : 6323107, ఫేక్స్ : 6260642.

హైదరాబాద్ : క్లాసిక్ ఏజెన్సీస్, ఫోన్ : 557477. విజయవాడ : ఎమ్.పి. మెటల్ కార్పొరేషన్, ఫోన్ : 422351.
విశాఖపట్నం : మహవీర్ గ్లాస్ హౌస్, ఫోన్ : 547105. కరీమ్‌నగర్ : గణేష్ ఎంటర్‌ప్రైసెస్, ఫోన్ : 42807.

Sureshot/319

"రేపెలాగైనా అడిగెయ్యాలి" అనుకున్నాడు శ్యామ్.

"ప్రొసీడ్" ప్రోత్సహించాడు మధు.

xx xx xx

వెయ్యిన్నూటపదహారు అక్షరాలతో తయారు చేసుకున్న ప్రేమ ఉపన్యాసమంతా మాటతొంభైసార్లు రిహార్సల్స్ చేసిందంతా వినిత తల్లో జాజుల పరిమళం ఎదని చుట్టగానే వుక్కిరిబిక్కిరై అంతా మర్చిపోయి "మనం పెళ్ళి చేసుకుందామా" అన్నాడు శ్యామ్.

"చేసుకోవచ్చు. ఉద్యోగం వుందా" వినిత కొంటెనవ్వుని శ్యామ్ అర్థం చేసుకోకుండా "అయితే మీకు ఈ అభిప్రాయం వుందా. మరి చెప్పలేదేం" అన్నాడు గంభీరవదనంతో.

"ముందు మీరే చెప్పాలని"

"అదేంటి లేడీస్ ఫస్ట్ కదా" సందేహం వ్యక్తపర్చాడు శ్యామ్.

"అయ్యో అవన్నీ కాగితాల మీదకో, వేదికల మీదకో. స్త్రీ ఏ అభిప్రాయం ముందుగా డిక్లేర్ చెయ్యకూడదండి. అలా చేస్తే మగవాడి అహం దెబ్బతింటుంది. ఏంటో విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా ఇలా దెబ్బతిన్న మగవానికి మందు కనిపెట్టలేకపోతున్నది." అంటూవిచారం వెళ్ళబోస్తున్న వినితని చూస్తుంటే అసలామె తన ప్రేమని ఆమోదించిందా. లేదా అని సందేహం వచ్చింది శ్యామ్‌కి. అతని అనుమానం తీర్చడానికాన్నట్టు ఆమె "పెళ్ళికి కావల్సినవన్నీ మీరే కొనాలి కదా. మీక్కావల్సినవి నే కొంటాను. ఇదిగోండి గాజు ఆది" అంటూ చేతి నుంచి ఓ పచ్చని గాజు తీసి అందించి "వస్తాను" అంటూవెళ్ళిపోయింది.

శ్యామ్ గుండెల నిండా గాజుల గలగలలే.

xx xx xx

ఈ ప్రేమ–పెళ్ళి గురించి ఇంట్లో వినిత చెప్పలేదు. ఆడపిల్లలు ప్రవర్తన – క్రమశిక్షణ గురించి రోజూ ఏదో ఒక సందర్భంలో లెక్చరిచ్చే తండ్రి అస్సలు ఒప్పుకోడు. పుట్టినప్పటి నుంచి కులం – మతం – గడపదాటని మనస్తత్వం మధ్య పెరిగి – తిరుగాడుతున్న తల్లి వీటిని అర్థం చేసుకోదు. పైగా పాపం – తప్పు అంటూ భయపడుతుంది.

అటు శ్యామ్ ఇంట్లో ఒప్పుకోరు. అందుకే ఆర్థికంగా తమ కాళ్ళపై తాము నిలబడి పెళ్ళి చేసుకొని అప్పుడు ఇళ్ళల్లో చెప్పాలని నిర్ణయించింది వినిత.

ప్రేమని సీరియస్‌గా తీసుకున్నాడు కాని పెళ్ళిని సీరియస్‌గా తీసుకోలేదు శ్యామ్.

అనితకి సంబంధం సెటిల్ అయింది. వినితకి సెటిల్ చేసి ఇద్దరికీ ఒక్కరోజు తేడాలోనే, ఉదయం, సాయంత్రం ముహుర్తానికి పెళ్ళి చేసెయ్యాలని పట్టుదలగా గిరిధరరావు సంబంధాలు వెతికాడు.

"సంబంధం కుదిరింది" అని తెలియగానే వినిత తనని ఎవ్వరూ అడగకపోయినా "నాకు నచ్చలేదు" అని తిరస్కరించింది.

ఈ రివల్యూషన్ వెనక ఏ విమెన్స్‌లిబ్ వుందోనని గిరిధరరావు కంగారుపడి మరింత వాడిగా వినితని మందలించి ఒప్పించడానికి ప్రయత్నించాడు.

ఆమె మరింత మొండికేసింది.

శ్యామ్‌ని తొందర పెట్టింది.

తన విషయం తెలిస్తే తండ్రి హత్య–ఆత్మహత్యల వరకు వెళతాడని ఆమెకి చికాకు.

పెళ్ళి చేసుకునేక ఎవ్వరేం చెయ్యగలరు? అవ్వకముందు తెలిస్తేనే సమస్యంతా.

అమ్మాయి తిరస్కరించిందని తెలిస్తే అల్లరవుతుందని "అంతకట్నం ఇచ్చుకోలేను" అని గిరిధరరావు ఆ సంబంధం వదులుకున్నాడు.

మరో సంబంధం వెతుకుతున్నాడు. ఇది కూడ తిరస్కరిస్తే తండ్రికి ఖచ్చితంగా అనుమానం వస్తుంది. వినిత శ్యామ్‌ని తొందర చేస్తూ తను ఉద్యోగానికి ప్రయత్నించింది.

xx xx xx

"ఏమైంది నీ ఉద్యోగం" మూడు రోజుల తర్వాత వచ్చి అడిగింది వినిత.

"రాలేదు"

"అస్సలు ట్రై చేసుండవే. పోన్లే నాకు దొరికింది. మనిద్దరికీ ఆ జీతం సరిపోతుంది" అంది సంతోషంగా.

"అహా..." అన్నాడు శ్యామ్.

"నువ్వు, మధు కలసి పెళ్ళి ఏర్పాట్లు చూడండి. చాలా సింపుల్‌గా అవ్వాలి" అందామె.

"అప్పుడే పెళ్ళేంటి. ఉద్యోగం రానీ" నెమ్మదిగా అన్నాడు శ్యామ్.

"నాకుందిగా"

"ఛ. ఛా. ఆడపిల్లల డబ్బు తింటున్నావ్ అంటారు నలుగురు" అన్నాడు శ్యామ్.

వినిత బిత్తరపోయింది.

ఆడపిల్ల...డబ్బు...ఛీ..ఛా....లు ఆమెకి కొత్తకాదు. కాని అవి శ్యామ్ నోటి నుంచి వినటం చాలా చాలా ఆశ్చర్యం.

"నీ...క్కూ...డ ఇటువంటి అభిప్రాయాలున్నాయా" శ్యామ్‌ను బాధగా అడిగిందామె.

శ్యామ్ మూడు నిమిషాలు మౌనంగా వుండి "అసలు నిన్ను పెళ్ళి చేసుకుంటానంటేనే ఫ్రెండ్స్ అంతా నవ్వుతున్నారు" అన్నాడు.

"నవ్వుతున్నారా ఏం" చివ్వున అడిగిందామె.

"అవును. నవ్వుతున్నారు. అమ్మా నాన్న తెచ్చిన సంబంధం చేసుకుంటే నాకు కట్నం లక్షల్లో వస్తుంది. ఇంట్లో వాళ్ళతో ఏ గొడవలు లేకుండా ఆస్తిలో వాటా నాకుంటుంది. ఇవన్నీ వదిలి నిన్నెందుకు చేసుకుంటున్నావ్?' అని వాళ్ళు అడిగితే 'ఇష్టం – ప్రేమ' అని చెపితే 'తిరుగు – అనుభవించు ! అంతే కాని ఆదర్శాలకి పోయి పండంటి జీవితం పాడుచేసుకోకు' అంటూ సలహా ఇస్తున్నారు. ఇప్పుడిలా ఉద్యోగంలో సెటిల్ కాకుండా పెళ్ళికూడా చేసేసుకుంటే భవిష్యత్‌ని నాశనం చేసుకున్నాని మరింత నవ్వుతారు" రోషంగా అన్నాడు శ్యామ్.

వినిత నిశ్శబ్దంగా శ్యామ్‌ని చూస్తూంది.

ఇంట్లో ఏమైనాగొడవయ్యిందాని అతడెప్పుడూ అడగడు. తను పెళ్ళికి తొందరపెడుతూ ఇంట్లో ఏం జరుగుతూందో చెప్పింది. అప్పుడు కూడా మనం పెళ్ళి చేసుకుందామని కాని, ఏ గొడవైనా నేనున్నానని ధైర్యం చెప్పటంకానీ, అసలు ఇంట్లో పరిస్థితి ఏమిటని కాని అతడు అడగడు.

ఎన్నో ఇబ్బందులు ఎదురైనా అతను ఏ టైమ్‌కి కల్సుకోమంటే ఆ టైమ్‌కి కల్సుకునేది. "ఏమైనా ఇబ్బందుందా" అని అడగాలని తోచదు శ్యామ్‌కి.

అవన్నీ ఓ ఎత్తు. ఇప్పడేమో కట్నం, ఫ్రెండ్స్, ఉద్యోగం, ఆడపిల్లా, సంపాదనా అంటూ మాట్లాడుతున్నాడు! శ్యామ్ వైపు ఆకర్షితురాలయ్యేటప్పటికి ఆమెకి అతను చదివే పుస్తకాల గురించి తెలుసు. రూపం తెలుసు. కానీ స్త్రీ గురించీ, భార్య గురించీ ఏం ఆలోచిస్తాడో ఆమెకి తెలియదు.

"నువ్వు సంపాదిస్తే ఆ డబ్బుతో నే బ్రతకొచ్చా" అడిగిందామె.

"అదే నే సంపాదిస్తే నువ్వెందుకు ఖర్చు చెయ్యకూడదు" అందామె.

"నే భర్తని కదా. భర్తంటే భరించేవాడుగా" అన్నాడతను. వినిత తదేకంగా అతని కళ్ళల్లోకి చూసింది.

భర్త అనే పదం కలిగించిన గొప్ప గర్వంతో తృప్తిగా మెరుస్తున్నాయ్ అతని కళ్ళు.

ఆమె ఎదలో ఆలోచనా తరంగాలు.

నీ ఎద సెలయేటి ఒడ్డున తీయని తరగల మృదు జీవన గానం కోసం తపిస్తూ, నీ సాంగత్యం కోసం అన్వేషిస్తే – వేదాలు చదివినా, ఉపనిషత్తులు పఠించినా, అరబిందాని అరిచేతిలో ఇముడ్చుకున్నా, పి.జి.సర్టిఫికెట్ గుండెలకి ఆనించుకున్నా – భర్తంటే భరించేవాడని – ఆడది – సంపాదన, ఛీ, కట్నం, కానుక, అనుభవం – తరతరాల మగసంస్కారాన్ని, సంస్కృతిని, నాగరికతని, ఆచారాన్ని – నాలుగు వేదాల్లా – పగిలిన గవ్వల గలగలల్లా వినిపించేస్తున్నావా?

ఆమె నిదానంగా గది తలుపు తీసింది. స్థిరంగా బయటికి అడుగేస్తుంటే "అదేంటి అప్పడే వెళ్ళిపోతున్నావ్" అడిగాడు శ్యామ్.

"స్నేహపూరితమైన తోడు కావాలి. భరించే భర్త నాకొద్దు"

అంటూ గడపదాటిందామె.

xx xx xx